నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | HYDERABAD

ఖనిజాల తవ్వకాల్లో ఎన్‌జీఆర్‌ఐ సాయం

సిటీబ్యూరో: ఖనిజాల తవ్వకాల్లో ఖనిజ్ బిదేశ్ ఇండియా(ఖబిల్)కు ఎన్‌జీఆర్‌ఐ సహకరించనున్నది. నేషనల్ అల్యూమినియం కంపెనీ, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీల ఉమ్మడిగా ఖబిల్ సంస్థ వ్యవహరిస్తుండగా, ఖనిజాలను గుర్తించడంలో ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఎన్‌జీఆర్‌ఐలో ఖబిల్ డైరెక్టర్ సదాశివ్ సమంతరాయ్, ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డా. ప్రకాశ్ కుమార్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

గన్‌బజార్‌లో ప్రచారం చేస్తున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కూకట్‌పల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కృష్ణారావు, రాజశేఖర్‌రెడ్డి, వివేకానంద, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దయానంద్, మల్కాజిగిరి ఎంపీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత

కాంగ్రెస్ పాలనలో బర్కత్ లేదు

కేసీఆర్ పాలన లేక.. రాష్ట్రం ఆగమైంది

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ/ఎల్బీనగర్, ఏప్రిల్ 25 : నాడు నిండిన చెరువులు...పచ్చని చెట్లు.. పాడిపంటల్లో మాజీ సీఎం కేసీఆర్ కనిపించే వారని.. నేడు ఎండిన చెరువులు, కరువు కాటకాల్లో సీఎం రేవంత్ రెడ్డి కనిపిస్తున్నారని....కేసీఆర్ పాలన లేక రాష్ట్రం ఆగమైందని... కాంగ్రెస్ అంటేనే కరువు... కష్టాలని.. ఐదు నెలల పాలనతో ప్రజలకు అర్థమైందని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. గురువారం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మెట్రోలో ప్రయాణించి..ఎన్నికల ప్రచారం చేశారు. ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి వరకు ప్రయాణించిన వీరంతా.. ప్రయాణికులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నగరాభివృద్ధిని వివరిస్తూ.. ఓట్లు అభ్యర్థించారు. అనంతరం కూకట్‌పల్లి స్టేషన్‌లో వీరికి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన చరిత్ర అని.. అన్ని రంగాల్లో రాష్ట్రం నంబర్ వన్‌గా అభివృద్ధి చెందిందని, పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. రాష్ట్రంలోని గ్రామాల్లో క్రీడామైదానాలు, శ్మశానవాటికలు, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతుబంధు, దళిత బంధు, వృద్ధులకు పింఛన్లు అందాయని, చెరువులను అభివృద్ధి చేయగా.. నిండుకుండాల మారి.. చేపలు.. నీటితో కళకళలాడేవన్నారు. ప్రస్తుతం కేసీఆర్ పాలన లేక.. చెరువులన్నీ ఎండిపోయాయని, సునామీ కంటే ఘోరంగా పరిస్థితులన్నీ మారిపోయాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, హైదరాబాద్ విశ్వనగరంగా మారిందన్నారు.

చేతగాక.. తిట్లదండకం

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చిందని, గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు పరిపాలన చేతగాక.. బీఆర్ఎస్ పార్టీపై తిట్లదండకం అందుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పడంతో ప్రజలు మోసపోయి ఓట్లేశారని, ప్రజలు అమాయకులు కారని, ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే మోసం అని... కాంగ్రెస్ అంటేనే కరెంట్, తాగునీటి కష్టాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గోవిందా.. అని ప్రజలకు అర్థమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా.. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, పేద ప్రజలకు బర్కత్ ఉండటం లేదని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులు లేక... కరీంనగర్, చేవెళ్ల నుంచి అభ్యర్థులను బరిలో దింపిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లోకల్ అని.. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలందరి మధ్యలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో 3.5 లక్షల మెజార్టీతో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కేసీఆర్‌కు మల్కాజిగిరి ఎంపీ స్థానాన్ని కానుకగా ఇస్తామన్నారు.

• మెట్రోలో ప్రయాణించి.. ఓట్లు అభ్యర్థించి

మెట్రోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరికి చేసిందేమీ లేదు..

ప్రజలు నమ్మి ఎంపీగా రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే మల్కాజిగిరికి చేసిందేమీ లేదని, ఒక్క రోజైనా.. ప్రజల కష్టాలు తెలుసుకోలేదని.. ఒక్కసారి కూడా ఇక్కడి ప్రజల కోసం మాట్లాడలేదని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మళ్లీ పరాయి వ్యక్తులను తీసుకొచ్చాయని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, శిరీషాబాబురావు, సబీహాబేగం, పండాల సతీష్‌గౌడ్, ముద్దం నర్సింహాయాదవ్, అవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరిశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, ఏప్రిల్ 25: మాయమాటలు చెప్పి అమలు చేయలేని హామీలు ఇచ్చి మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ఓటుతోనే తగిన గుణపాఠం చెప్పాలని, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో వార్డు రసూల్‌పురలోని గన్‌బజార్‌లో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో ఇంటింటికీ చేపట్టిన పాదయాత్రలో పాల్గొని అమె మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గడిచిన పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, సీనియర్ నాయకులు దేవలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

ఇంకుడు గుంతల నిర్మాణానికి సాంకేతిక సాయం

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : ఇంకుడు గుంతల నిర్మాణంపై పలు ప్లంబర్లు, మేస్త్రీలకు ఇచ్చిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాతావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. హైదరాబాద్‌లో భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో వాటిని రీచార్జ్ చేయడానికి జలమండలి పలు చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ట్యాంకర్లు ఎక్కువగా బుక్ చేసుకున్న 30వేల మంది ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించామన్నారు. ఇందుకోసం 18 ఎన్జీవో సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వారు 700 మందిని కలిసి ఇంకుడు గుంతల ప్రాముఖ్యం, నిర్మాణ పద్ధతిని వివరించినట్లు ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారంతా హైదరాబాద్ నగరంలో ఇంకుడు గుంతలను నిర్మించుకునే వారికి సాంకేతిక సాయాన్ని అందిస్తారని వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపీటీఆర్ఐ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా చర్యలు చేపట్టినట్లు ఎండీ వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రసాయనాలతో పండ్లు పక్వం

సిటీబ్యూరో, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ) : కొత్తపేట ఫ్రూట్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పండ్లను మగ్గ బెట్టే రసాయనాలను గుర్తించారు. అక్రమంగా వీటిని వినియోగిస్తున్నట్లు తేల్చిన అధికారులు.. భారీ మొత్తంలో ఈథైలిన్ సెల్యూలోజ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాయలు త్వరగా పక్వానికి వచ్చేలా వీటిని ఉపయోగిస్తున్నారు. మూడు గోడౌన్లను సీజ్ చేసిన అధికారులు.. షేక్ ఖయ్యూమ్ ట్రేడింగ్ కంపెనీ, ఎస్ఎస్ఎస్‌బీ బనానా ఫ్రూట్ కంపెనీ, ఏబీసీ ఫ్రూట్ కంపెనీలపై చర్యలు తీసుకున్నారు. రూ. 55వేలు విలువ చేసే ఈథైలిన్ సెల్యూలోజ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, చిత్రంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, మహమూద్ అలీ

సమష్టిగా పనిచేద్దాం.. గెలుద్దాం

సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

బేగంపేట, ఏప్రిల్ 25: సమష్టిగా పనిచేసి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేద్దామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ...సామాన్య కార్యకర్త నుంచి తాను ఎదిగానని చెప్పారు. బీజేపీ నుంచి ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన నిధులన్నీ ల్యాప్స్ అయ్యాయన్నారు. జై శ్రీరాం, జై మోదీ అని చెప్పుకుంటూ కిషన్‌రెడ్డి ఓట్లు అడుగుతున్నారన్నారు. ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ బీఫాంతో గెలిచి వేరే పార్టీలోకి వెళ్లి రాజీనామా చేయకుండా ఎంపీగా పోటీ చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఉన్న పదవి కూడా పోతుందన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఈ నెల 27 నుంచి సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో పాదయాత్రలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, ప్రభాకర్‌రావు , స్థానిక కార్పొరేటర్లు మహేశ్వరి, కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీసేలా..

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : పిల్లల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రేటర్‌వ్యాప్తంగా వివిధ క్రీడా మైదానాల్లో మే 31 వరకు జరిగే ఈ శిబిరాల్లో 44 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని గ్రౌండ్, చందానగర్‌లోని పీజేఆర్ మైదానంలో సమ్మర్ కోచింగ్ కార్యక్రమానికి కమిషనర్ రోనాల్డ్ రాస్ హాజరై మాట్లాడారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, వారు నచ్చిన క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. 6 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మే 31 వరకు ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, క్రీడాకారిణి నైనా జైస్వాల్, స్పోర్ట్ విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్త!

ఓఆర్ఎస్ పౌడర్ ఓకే.. ఓఆర్ఎస్ఎల్ వద్దు

సిటీబ్యూరో: సాధారణంగా వేసవిలో డీహైడ్రేషన్, నీరసం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. దీనిని అధిగమించేందుకు చాలా మంది రకరకాల ద్రావణాలు, పానీయాలు తాగుతుంటారు. అయితే త్వరగా కోలుకుని, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ తాగాలని వైద్యులు సూచించడం సహజం. అయితే చాలా మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం కలిగిన ఓఆర్ఎస్‌కు బదులుగా ఓఆర్ఎస్ఎల్ డ్రింక్స్‌ను తీసుకుంటున్నారని, ఇది ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులు ఇలాంటి డ్రింక్స్ తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉన్నదని డాక్టర్ శివరంజిని సంతోష్ హెచ్చరిస్తున్నారు. ఓఆర్ఎస్ఎల్ డ్రింక్స్‌లో చక్కెర స్థాయి అధికంగా ఉండటం వల్ల కణాలలో నుంచి నీరు రక్తనాళాల్లోకి చేరి, మూత్రం రూపంలో బయటకు వెళ్లిపోతుందన్నారు. ఈ క్రమంలో శరీరంలో నుంచి నీరు బయటకు వెళ్లిపోయి, శరీరం మరింత డీహైడ్రేషన్‌కు గురవుతుందని తెలిపారు. డీహైడ్రేషన్ ప్రమాదకరమని, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రాణాంతకం అయ్యే అవకాశాలు లేకపోలేదని హెచ్చరించారు.

హోరా హోరీ..

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ముమ్మరం కానున్న అభ్యర్థుల ప్రచారాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పర్వంలో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. గురువారం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ల సెట్లను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. చివరి రోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు గురువారం హైదరాబాద్ స్థానానికి 25 మంది, సికింద్రాబాద్ స్థానానికి 23 మంది, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి 15 మంది, మల్కాజిగిరి స్థానానికి 61 మంది, చేవెళ్ల స్థానానికి 30 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు కాగా, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్నది. మొత్తంగా నామినేషన్ల దాఖలు ముగియడంతో పోల్‌పోరులో తాడోపేడో తేల్చుకునేందుకు అభ్యర్థులు ప్రచారంలో స్పీడ్ పెంచారు. అగ్ర ప్రచారంలోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటేలా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

గురువారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగింది. మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులు భారీగా తరలిరావడంతో మైదానంలో సందడి నెలకొంది.